క్లుప్తంగా

ఆర్ఎస్‌యూ కార్యవర్గం ఎన్నిక



సమావేశంలో పాల్గొన్న ఆర్ఎస్‌యూ సంఘ నాయకులు

ఒంగోలు సెంట్రల్: ప్రభుత్వం విద్యారంగంలో ఉన్న పలు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రెవల్యూషనరీ విద్యార్థి సంఘం (ఆర్ఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్ రెడ్డి కోరారు. జిల్లా నూతన కమిటీ కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా ఈదుపల్లి నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా పరుచూరి అవినాష్, జిల్లా ఉపాధ్యక్షుడిగా వర్షిత్, వివేక్, జిల్లా సహాయ కార్యదర్శులుగా లిటిల్ కుమార్, సాయి, కోశాధికారిగా సుబ్రహ్మణ్యం, జిల్లా కార్యవర్గ సభ్యులుగా రాజేష్, సునీల్, రాంబాబులను ఎన్నుకున్నారు.

విద్యార్థులపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలి


మాట్లాడుతున్న హెచ్ఎం సుబ్బారావు

కొత్తపట్నం: మీ పిల్లలను ఉపాధ్యాయులుకే వదిలేయకుండా, ఇంటికొచ్చిన తరువాత వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం పాలేటి సుబ్బారావు అన్నారు. గురువారం తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతూ పిల్లలు పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. క్లాసులకు వెళ్లి పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలు, చదువుల వివరాలు తెలుసుకోవాలని సూచించారు.

గ్రానైట్ సమస్యలు పరిష్కరించండి


సమస్యలను వివరిస్తున్న నాయకులు

చీమకుర్తి: గ్రానైట్ సమస్యలను పరిష్కరించాలని ఫెమి అసోసియేషన్ నాయకులు డాక్టర్ సీహెచ్ రావు, పుట్టా రామకృష్ణ మైన్స్ సెక్రటరీ కాంతారావుకు గురువారం వినతిపత్రం అందించారు. విజయవాడలోని మైన్స్ కార్యాలయంలో కలుసుకొని గ్రానైట్ రంగంలో ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఇబ్బందులు వివరించినట్లు తెలిపారు.

స.హ చట్టానికి తూట్లు


మాట్లాడుతున్న అమృతపాణి

ఈతముక్కల (కొత్తపట్నం): ప్రభుత్వ అధికారులు చేసిన తప్పులను, అవినీతిని వెలుగులోకి తెచ్చేందుకు, ప్రశ్నించేందుకు ప్రజలకు ఉన్న ఏకైక ఆయుధం సమాచార హక్కు చట్టమని సామాజిక సహోద్యమ వేదిక రాష్ట్ర కార్యదర్శి గడ్డం అమృతపాణి అన్నారు. ఈతముక్కల అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం విలేకర్లతో మాట్లాడారు. సమాచారం చట్టం వచ్చి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్నప్పటికీ ప్రభుత్వ కార్యాలయాల్లో దరఖాస్తుదారులకు ఇచ్చే సమాచారం నేటికీ ఆచరణలో లేదన్నారు. చట్టాన్ని ఆచరణలో పెట్టాల్సిన అధికారులే చట్టాన్ని నీరుగారుస్తూ ప్రజల హక్కు ఖూనీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో 4(1)(బి) తప్పనిసరిగా అమలు పరచడంలేదని.. దరఖాస్తు దారులు సెక్షన్ 6(1) ప్రకారం దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో సమాచారం ఇవ్వాల్సి ఉన్నా పట్టించుకొనేవారు లేకపోవడం దురదృష్టకరమన్నారు.

జిల్లాను కరువు పీడిత ప్రాంతంగా ప్రకటించాలి


మంత్రులకు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

ఒంగోలు: జిల్లాను కరువు పీడిత ప్రాంతంగా ప్రకటించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున, రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌లకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జీవీ కొండారెడ్డి , పలువురు సీపీఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రజా పరిషత్ సమావేశానికి విచ్చేసిన మంత్రులకు తమ వినతిపత్రాన్ని అందించారు. జిల్లాను కరువు పీడిత ప్రాంతంగా ప్రకటిస్తూ తీర్మానం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. అదే విధంగా సీపీఎం నిర్వహించిన పాదయాత్ర సందర్భంగా గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.


నూతన గృహం వద్ద ప్రజా ప్రతినిధులు


చీమకుర్తిలోని కేవీపాలెం లే అవుట్ - వైఎస్సార్ జగనన్న కాలనీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రులు మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ దినేష్ కుమార్, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి


చీమకుర్తిలోని కేవీపాలెంలో వైఎస్సార్ జగనన్న కాలనీ


సభకు హాజరైన లబ్ధిదారులు

ప్రజల ఆరోగ్యమే సీఎం జగన్ ధ్యేయం

మద్దిపాడు: ప్రజలందరి ఆరోగ్యమే మహా భాగ్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాటు పడుతున్నారని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. గురువారం దొడ్డవరప్పాడులో జగనన్న ఆరోగ్య శిబిరంలో మాట్లాడారు. గత ముఖ్యమంత్రి చంద్రబాబు వేల కోట్ల రూపాయలను దోచుకుని జైల్లో కూర్చుంటే.. ఆయన కోసం నిరాహార దీక్షలు నిర్వహించడం అర్థరహితమన్నారు. చంద్రబాబు నిజంగా ఎటువంటి అవినీతికి పాల్పడకపోతే బయటకు వస్తారని, అప్పటి వరకూ తెలుగు తమ్ముళ్లు వేచి ఉండాలి అని హితవు పలికారు. 2019 ఎన్నికల్లో 23 సీట్లకు పరిమితం చేశారని రాబోయే ఎన్నికల్లో భూస్థాపితం చేస్తారన్నారు. పేద ప్రజల కోసం పాటు పడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. మండవ అప్పారావు, ఎంపీపీ వాకా అరుణ కోటి రెడ్డి, గట్టినేని అయ్యన్న, మోరబోయిన సంజీవరావు, గుడ్డపాతల రవి విల్సన్, ఘడియపూడి సర్పంచ్‌బొమ్మల రామాంజనేయులు, బత్తుల శ్రీనివాసరావు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ రజని, సర్పంచ్ బెజవాడ రాము, డాక్టర్లు పాల్గొన్నారు.


దొడ్డవరప్పాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

నాగులుప్పలపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం రక్షగా పనిచేస్తుందని జెడ్పీటీసీ యాదాల రత్న భారతి అన్నారు. గురువారం మాచవరంలో సర్పంచ్ ఇనగంటి సీతారావమ్మ వెంకట రమణా రెడ్డి చేతులు మీదుగా ప్రారంభించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ ఆసుపత్రి వైద్యం అందించడం సీఎం జగన్ ధ్యేయమన్నారు. తహసీల్దార్ సుజన్ కుమార్, ఈవోఆర్డీ ఏ.వి కుమారి, అంజిరెడ్డి ఉన్నారు.


చీమకుర్తి: వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

ఒంగోలు రూరల్: యరజర్ల యూపీ స్కూలులో గురువారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో సీనియర్ మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో పరీక్షలు చేశారు. సర్పంచ్ తమ్మిశెట్టి రాములమ్మ రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఒంగోలు తహసీల్దార్ పి.మురళి, కరవది సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.వాణి, మండల వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు తమ్మిశెట్టి శ్రీనివాసులు, కార్యదర్శి రామకృష్ణ, ఎంపీఈవో కృష్ణారెడ్డి పాల్గొన్నారు. మలేరియా అధికారి జ్ఞానేశ్వరి సందర్శించారు. ఈవోఆర్డీ మారెడ్డి రమణమ్మ, ఎంపీహెచ్ఈవో కృష్ణారెడ్డి, డాక్టర్ సుందర్ ప్రసాద్, ఏఎన్ఎంలు, సీహెచ్‌వోలు, ఆశాలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సంతనూతలపాడు ఎంపీపీ బి.విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ విజ్ఞప్తి చేశారు. గురువారం సంతనూతలపాడు మండలం చిలకపాడులో నిర్వహించిన కార్యక్రమంలో మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు బొల్లినేని కృష్ణయ్య ముఖ్య అతిథులుగా మాట్లాడారు. అనంతరం సంతనూతలపాడు, వేములపాడు ప్రభుత్వాసుపత్రులకు చెందిన డాక్టర్ల ఆధ్వర్యంలో మందులు పంపిణీ చేశారు.


మందులు అందజేస్తున్న సర్పంచ్, అధికారులు


రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న రాములమ్మ, శ్రీనివాస్, తహసీల్దార్ మురళి, మెడికల్ ఆఫీసర్ వాణి

పేదలకు కార్పొరేట్ వైద్యం అందాలి

- వైఎస్సార్ ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ యాదాల అశోక్‌బాబు

మద్దిపాడు: ప్రతి పేదవాడికి కార్పొరేట్ వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైఎస్సార్ ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ యాదాల అశోక్ బాబు అన్నారు. గురువారం దొడ్డవరప్పాడులో జగనన్న ఆరోగ్య సురక్ష మెగా మెడికల్ క్యాంపు సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీపై అవగాహన ఉన్నవారు కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారని.. కానీ గ్రామాల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని వైద్యశాఖ సిబ్బందిని కోరారు. రోగులను గుర్తించి వారికి దగ్గరలోని కార్పొరేట్ ఆసుపత్రులకు రిఫర్ చేయాలని కోరారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆరోగ్యశ్రీ కార్యాక్రమాన్ని పునరుద్ధరించి 3250కి పైగా వ్యాధులను ఆరోగ్యశ్రీలో చేర్చారన్నారు. ప్రతి పేదవానికి కార్పొరేట్ వైద్యం ఎంత ఖర్చు అయినా ప్రభుత్వం భరించడానికి ముందు నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు ఆరోగ్యశ్రీ పై అవగాహన కల్పిస్తూ వారిని చైతన్య వంతులను చేయాలని కోరారు. అనంతరం పలువురు రోగులతో మాట్లాడుతూ వారికి ఏ తరహా వ్యాధి ఉంది చికిత్స తీసుకున్నారా అని తెలుసుకున్నారు. పలు విభాగాల వైద్యులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సర్పంచ్ బెజవాడ రాము, తహసీల్దార్ రజనీ, ఎంపీడీఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


దొడ్డవరప్పాడులో మాట్లాడుతున్న యాదాల అశోక్‌బాబు

ఒంగోలు గ్రంథాలయంలో

ఉచిత సభ్యత్వ నమోదు

ఒంగోలు మెట్రో: స్థానిక కేంద్ర గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో గ్రంథాలయ సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం నిర్వహించారు. జాలాది మోహన్ ఆర్థిక సహాయంతో పీవీఆర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు 10 మందికి గ్రంథాలయ సభ్యత్వం ఇచ్చారు. ఆదిలక్ష్మి మాట్లాడుతూ గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను చదివి వాటి ద్వారా విజ్ఞానాన్ని పొందాలని, ఒక్కో పుస్తకంలో ఒక్కో ప్రత్యేకమైన విషయాలు నిక్షిప్తమై ఉంటాయన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి గ్రంథాలయ సభ్యత్వం తీసుకోవాలని, వారికి నచ్చిన పుస్తకాలు ఇళ్ల తీసుకు వెళ్లి చదువుకోవచ్చని తెలిపారు. దసరా సెలవుల సందర్భంగా 15వ తేదీ నుంచి 24 వరకు ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు చదవటం మాకిష్టం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాలాది మోహన్ మాట్లాడుతూ చిన్నతనం నుంచే గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదవటం అలవాటు చేసుకోవాలన్నారు. సూపర్ స్టార్ కృష్ణ కళాపరిషత్ అధ్యక్షుడు డాక్టర్ మొగిలి దేవ, ఉపగ్రంథ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి, కళాపరిషత్ కోశాధికారి ఐ.నరసింహారావు, ఉపాధ్యక్షులు నున్నా ఆంజనేయులు పాల్గొన్నారు.


గ్రంథాలయాల సభ్యత్వం తీసుకుంటున్న విద్యార్థినులు

వ్యవస్థాపకతపై అవగాహన సదస్సు

ఒంగోలు సెంట్రల్: పేస్ కళాశాలలో వ్యవస్థాపకత (ఎంట్రప్రెన్యూర్ షిప్) యాక్టలైజేషన్‌పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. శ్రీ క్రిష్ణ దేవరాయ యూనివర్సిటీ అటల్ ఇంక్యుబేషన్ సీఈఓ డాక్టర్ శివ కుమార్ మాట్లాడారు. ఒక వ్యాపారాన్ని ఏలా ప్రారంభించాలి, అభివృద్ధి చెయ్యాలి, దేశంలో అమలు పరస్తున్న వివిధ రకాల బిజినెస్ స్కీంలను ఎలా సద్వినియోగం చేసుకోవాలి అనే విషయాలను వివరించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెట్ డాక్టర్ మద్ది శెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ అఫైర్స్ డాక్టర్ ఆర్. వీరాంజనేయులు, ఇంక్యుబేషన్ ఇన్‌చార్జి డాక్టర్ వెంకటేశ్వరరావు, ఈడీసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఏలియా పాల్గొన్నారు.


సీఈఓని సన్మానిస్తున్న కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి

ప్రభుత్వ పథకాలపై గ్రామ సభలు నిర్వహించండి


ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు ప్రజలకు అర్థమయ్యేలా అధికారులు చొరవ తీసుకొని గ్రామ సభల ద్వారా అవగాహన సభలు నిర్వహించాలని టుబాకో బోర్డు సభ్యులు పాద వర ప్రసాద్, బీజేపీ బాపట్ల పార్లమెంట్ జనరల్ సెక్రటరీ లచ్చంశెట్టి టీగ్రా అన్నారు. ప్రభుత్వ పథకాల పట్ల ప్రజలకు ఉన్న అవగాహన రాహిత్యం వలన కొన్ని చోట్ల పథకాలు పక్కదోవపడుతున్నాయని దీనిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు ఎంపీడీవో జయమణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీగ్రా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతి ఇంటికి వాటర్ ట్యాప్ ఉచితంగా అందించాలన్న లక్ష్యంతో జలజీవన్ మిషన్ ప్రారంభించిందన్నారు. ఈ పథకం ద్వారా ఇప్పటికే నాగులుప్పలపాడు మండలంలో 5 కోట్ల 71 లక్షల రూపాయలు మంజూరయ్యాయని, దీనిని అర్హులైన వారికి సక్రమం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ మండలాధ్యక్షుడు పెంట్యాల సుబ్బారావు, సుదర్శన్ రావు ఉన్నారు.

కన్వీనర్ల బీమా పూర్తి చేయాలి

నాగులుప్పలపాడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు ప్రవేశపెట్టిన రూ.10 లక్షల బీమా పథకం గొప్పదని జేసీఎస్ మండల కన్వీనర్ కుమ్మారి సుధాకర్ అన్నారు. గురువారం అమ్మనబ్రోలు, నిడమానూరులో సచివాలయ కన్వీనరు, గృహ సారథులతో మాట్లాడారు. 100 శాతం బీమా నమోదు చేయడం పూర్తయిందని వివరించారు. పరంధామిరెడ్డి, ఉన్నం శ్రీనివాసరావు, సర్పంచ్ వడ్డిముక్కల శ్రీను, గంధ్ర రమణారెడ్డి, ప్రతాప్ రెడ్డి, ఊదరగుడి శ్రీనివాసరావు, ఆవుల రాజ్యలక్ష్మి తదితరులున్నారు.


నిడమానూరులో సమావేశమైన జేసీఎస్ కన్వీనర్ కుమ్మారి సుధాకర్

దేశ ఐకమత్యానికి కృషి

నాగులుప్పలపాడు: దేశంలో ఐక్యత, సమగ్రతను కాపాడటానికి అందరి కృషి ముఖ్యమని ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ యాదల రత్న భారతి అన్నారు. గురువారం నాగులుప్పలపాడులో జరిగిన నా మట్టి - నా దేశం ఐక్యతా ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడారు. దేశ సమగ్రతను కాపాడటానికి అన్ని గ్రామాల్లో నిర్వహించిన నా మట్టి- నా దేశం కార్యక్రమాల ద్వారా గ్రామాల్లో సేకరించిన నాణ్యమైన మట్టిని కలశంలో నింపి దేశ రాజధానిలో నిర్మించే వీరుల స్థూపానికి పంపడం అనేది చారిత్రత్మక నిర్ణమన్నారు. అనంతరం దేశ ఐక్యత కోసం ప్రతిజ్ఞ చేసి ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో జయమణి, తహసీల్దార్ సుజన్‌కుమార్, ఎంఈఓ రవి, ఏపీవో రవి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ, జెడ్పీటీసీ

15న సంగీత విభావరి

ఒంగోలు మెట్రో: మాగుంట శ్రీనివాసులు రెడ్డి జన్మదినోత్సవం పురస్కరించుకొని స్థానిక సీవీఎన్ రీడింగ్ రూం వద్ద ఆదివారం సంగీత విభావరి నిర్వహించనున్నామని కళా రంగం ప్రకాశం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మ తెలిపారు. కళా రంగం సభ్యులు, ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి కార్యక్రమ కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కళా రంగం స్థాపించి కళాకారులు, సంగీత వాయిద్యకారులు, గాయని గాయకులకు గుర్తింపు తెచ్చేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అభినందించారు. చల్లా బాలకొండయ్య, తాళ్లూరి శ్రీదేవి, తాళ్లూరు రవి, బండారు మల్లికార్జున, అయినాబత్తిన ఘనశ్యాం, సాంబశివరావు, శ్రీనివాసరావు, ఎన్. శేఖర్ రెడ్డి, ఎస్. నరస రాజు పాల్గొన్నారు.

ఎంఎల్సీ చంద్రశేఖర రెడ్డికి సత్కారం

ఒంగోలు: తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎంఎల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డిని జిల్లాలోని పలు ఉపాధ్యాయ సంఘాలు గురువారం ఘనంగా సత్కరించాయి. స్థానిక ఆంధ్రకేసరి యూనివర్శిటీ సమావేశ మందిరంలో ప్రధానోపాధ్యాయుల సంఘం సభ్యులు, ఏపీటీఎఫ్ సభ్యులు, యూటీఎఫ్ సభ్యులు, యూనివర్శిటీ సిబ్బంది ఈ సత్కార కార్యక్రమం జరిగింది. ఎంఎల్సీ చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు సంబంధించి నాడు- నేడు ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేస్తుందన్నారు. ఇవే కాక జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, స్మార్ట్ టీవీలు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్‌ను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తుందని చెప్పారు. తన గెలుపునకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు నరహరి అంజిరెడ్డి, ప్రొఫెసర్ వెంకటేశ్వరరెడ్డి, డీసీఈబీ కార్యదర్శి వై.వెంకట్రావు, గిరిప్రసాద్, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ రమేష్, శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం చంద్రశేఖరరెడ్డి యూనివర్శిటీ వీసీని కలిసి సత్కరించారు. యూనివర్శిటీ మౌలిక సౌకర్యాల కల్పనలో తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.


ఎంఎల్సీ చంద్రశేఖరరెడ్డిని సత్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

ఎమ్మెల్సీ దృష్టికి పార్ట్‌టైం పీజీటీల సమస్యలు

ఒంగోలు: తమ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపాలంటూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర రెడ్డికి పార్ట్‌టైమ్ పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లు విజ్ఞప్తి చేశారు. గురువారం జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశానికి విచ్చేసిన పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డిని వారు కలిసి వినతిపత్రం అందించారు. పార్ట్‌టైమ్ పీజీటీలుగా 2018-19 నుంచి పనిచేస్తున్నామని, అప్పటి పత్రికా ప్రకటన ద్వారా కాంట్రాక్టు పద్ధతిన ఎంపికయ్యామని, కానీ ఉత్తర్వుల జారీ సమయంలో పార్ట్‌టైమ్ పీజీటీలుగా ఉత్తర్వులు వచ్చాయన్నారు. దీనిపై అప్పటి జేసీ మాట్లాడుతూ తొలి ఏడాది ప్రథమ సంవత్సరం ఇంటర్ క్లాసులు మాత్రమే ఉండడం వల్ల ఇలా ఇవ్వడం జరిగిందని, తదుపరి సంవత్సరం నుంచి కాంట్రాక్టు పద్ధతిలో చేర్చి జీతం రెట్టింపు చేస్తామని చెప్పారన్నారు. సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీని కలిసి విజ్ఞప్తి చేసిన పార్ట్‌టైమ్ పీజీటీలు పవిత్ర, కె.రజని, హరిత, కళ్యాణి తదితరులున్నారు.

ఒక్క రోజులోనే బీచ్ రోడ్డుకు నిధులు మంజూరు


రూ.66 లక్షలు మంజూరైన పత్రాన్ని సర్పంచ్‌కు ఇస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

గుండమాల (కొత్తపట్నం): గుండమాలలో గడపగడపు మన ప్రభుత్వం కార్యక్రమం ఈ నెల 11న ప్రారంభమయ్యింది. దీనిలో భాగంగా గ్రామం నుంచి బీచ్‌కు గ్రావెల్ రోడ్డు వేయాలని, బంకమట్టితో ఎత్తు చేయాలని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిని గ్రామస్తులు కోరారు. దీంతో ఆయన జిల్లా పరిషత్ నిధుల నుంచి గురువారం ఎస్టిమేషన్ వేయించి రూ.66 లక్షలు మంజూరు చేయించారు. కె.పల్లెపాలెం నుండి గుండమాల వరకు రూ.46 లక్షలు, గుండమాల గ్రామం నుంచి బీచ్ వరకు రూ.20 లక్షలు మంజూరు చేయించారు. చెరువులో నుంచి బంకమట్టి తోలి ఎత్తు చేసిన తరువాత ఎన్ఆర్‌జీఎస్ నిధుల నుంచి గ్రావెల్ వేస్తారని చెప్పారు. రూ.65 లక్షలు మంజూరైన ఆర్డర్ కాపీని బాలినేని శ్రీనివాసరెడ్డి సర్పంచ్ కారాని జయరావుకు అందజేశారు. వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తామని చెప్పడం తాము ఊహించలేదని గ్రామస్తులు బాలినేనికి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ళ రవీంద్రరెడ్డి, సర్పంచ్ కారాని జయరావు, పీఆర్ డీఈ కాకుమాను శివకృష్ణారావు, ఎంపీడీవో పి.సుజాత, గోల్లపోతు నాగార్జున పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడాకారుల ఎంపిక

చీమకుర్తి: రాష్ట్ర స్థాయి ఖోఖో, షటిల్ బాడ్మింటన్ పోటీల్లో ప్రకాశం జిల్లా తరపున పాల్గొననున్న జట్లను గురువారం సంతనూతలపాడు జిల్లాపరిషత్ హైస్కూలులో ఎంపిక చేశారు. ఖోఖో అండర్ 14లో బాల బాలికల జట్లను వేరువేరుగా, షటిల్ బాడ్మింటన్ అండర్- 14లో బాలురు, అండర్-17లో బాల, బాలికల జట్లను వేరువేరుగా ఎంపిక చేశారు. అసోసియేషన్‌ల నాయకులు సీతారామిరెడ్డి, కాశీ విశ్వనాథ్ రెడ్డి పాల్గొన్నట్లు పీడీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. తొలుత క్రీడాపోటీలను వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ చేతుల మీదుగా ప్రారంభించారు. ఎంపికైన క్రీడాకారులను హెచ్ఎం, టీచర్లు అభినందించారు.

గ్రామాన్ని రోల్ మోడల్‌గా చేసుకుందాం

నాగులుప్పలపాడు: జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామంలో అభివృద్ధి పనులను చేసుకొని గ్రామాన్ని రోల్ మోడల్‌గా చేసుకుందామని ఆరోగ్యశ్రీ ట్రస్టు ప్రత్యేకాధికారి యాదల అశోక్ బాబు అన్నారు. గురువారం మట్టిగుంటలో నిర్వహించిన గ్రామ సభలో ఎంపీడీఓ జయమణి మాట్లాడారు. యాదల అశోక్ బాబు మాట్లాడుతూ గ్రామంలో ప్రజలకు ఉపయోగపడేలా చెరువు చుట్టూ మొక్కలు నాటడంతో పాటు తుఫాన్ బిల్డింగ్ నిర్మాణం, ఆకం చెరువు వరకు రోడ్డు నిర్మాణం వంటి అభివృద్ధి పనులు చేయాలని అధికారులను కోరారు. జెడ్పీటీసీ యాదల రత్న భారతి పాల్గొన్నారు.